నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 24 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 23 : జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిథిలావస్థ ఇళ్లల్లో ఉన్న వారు, వాగులు..వంకలు దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసర సమయాల్లో 100కు డయల్ చేయాలని సూచించారు. 24 గంటల పాటు బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు.


ఎస్పీ శ్రీనివాస రావు

## వృక్ష శిలాజాల పరిశీలన

కాగజ్‌నగర్/దహెగాం, జూన్ 23 : పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని లోడుపల్లి, కొండపల్లి అభయారణ్యాన్ని జీవవైవిధ్య కేంద్రంగా తీర్చిదిద్దుతామని కవ్వాల్ టైగర్ జోన్ సీసీఎఫ్ శాంతరాం అన్నారు. ఆదివారం లోడుపల్లి సెక్షన్, కొండపల్లి సౌత్ బీట్ కంపార్ట్‌మెంట్ నం.151లోని వృక్ష శిలాజాలను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డెరెక్టర్, డాక్టర్ మంజుషా, సీనియర్ జియోలాజిస్ట్ చక్రవర్తితో కలిసి పరిశీలించారు. శిలాజాలు ఎలా ఏర్పడ్డాయి, ఎప్పుడు ఏర్పడ్డాయి అన్న అంశంపై చర్చించారు. అలాగే రకరకాల చెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో సుధాకర్, డిప్యూటీ ఎఫ్ఆర్వో ప్రభాకర్, ఎఫ్‌బీవో మహేశ్ పాల్గొన్నారు.



శిలాజాలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

# సి 'కిల్'సెల్‌పై స్పెషల్ డ్రైవ్

**ఏజెన్సీలో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం**

- ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 40 వేల మందికి నిర్ధారణ పరీక్షలు
- అపై వ్యాధి ఉన్నట్లు గుర్తించిన వారికి వైద్య సేవలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : ఏజెన్సీ ప్రాంతాల్లో చాపకింద నీరులా వ్యాపిస్తున్న సికిల్ సెల్‌కు అడ్డుకట్ట వేసేందుకు వైద్యారోగ్యశాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నది. 2015, 2022లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా, తాజాగా ఈ నెల 19వ తేదీ నుంచి మరోసారి ప్రారంభించింది. సికిల్ సెల్ (అనీమియా) వంశపారపర్యంగా సంక్రమించే రక్త సంబంధిత వ్యాధి. సాధారణంగా ఎర్రరక్త కణాలు గుండ్రని ఆకారంలో ఉంటాయి. ఈ కణాలు రక్తనాళాల ద్వారా శరీరమంతటా ప్రయాణిస్తూ అవయవాలకు ప్రాణవాయువు (ఆక్సీజన్)ని సరఫరా చేస్తుంటాయి. అయితే కొంతమంది జన్యు సంబంధ మార్పుల వల్ల ఎర్ర రక్త కణాలు కొడవలి(సికిల్) ఆకారంలోకి మార్పు చెందుతాయి. ఈ వ్యాధి ఉన్న వారి రక్తకణంలోని ఒక జన్యువు సికిల్ సెల్ అని, ఇవి మామూలుగా ఉన్నవారిని సికిల్ సెల్ క్యారియర్(వాహకం) అని అంటారు. వీళ్లకి మామూలుగా ఎలాంటి ఆరోగ్య సమస్యలుండవు. అయితే వివాహం చేసుకున్న దంపతులిద్దరికీ ఇటువంటి లక్షణాలు ఉన్నట్లయితే వారికి పుట్టే పిల్లలకు రక్తకణంలోని రెండు జన్యువులు వంపు తిరిగి ఉంటాయి. అలాంటి పిల్లలకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. సాధారణ రక్త కణాల జీవితకాలం 120 రోజుల వరకు ఉంటే.. సికిల్ రక్త కణాల జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే ఉంటుంది. సికిల్ రక్త కణాలు నశించి పోయినంత వేగంగా.. కొత్తగా ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి కావు. దీంతో ఈ వ్యాధి ఉన్న వారు రక్తహీనతతకు గురవుతూ ఉంటారు. అంతేగాకుండా సికిల్ రక్త కణాలు వంపు తిరిగి ఉండడం వల్ల సన్నటి రక్తనాళాల్లో సరిగా ప్రవహించలేక శరీర భాగాలకు ఆక్సీజన్ అందడం తగ్గిపోతుంది. అందువల్ల ఈ వ్యాధి ఉన్నవారు తగిన చికిత్స తీసుకోకపోతే తక్కువ వయస్సులోనే అనారోగ్యానికి గురై చినిపోయే ప్రమాదముంటుంది.




### వయసు పెరిగే కొద్దీ లక్షణాలు..

సికిల్ సెల్ వ్యాధి అనేది హిమోగ్లోబిన్‌ను ప్రభావితం చేస్తుంది. హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ కణాలకు ఆక్సీజన్ సరఫరా చేయడంలో ముఖ్యపాత్రపోషిస్తుంది. సాధారణమైన హిమోగ్లోబిన్ అణువులు కొడలి ఆకారంలోకి మారడం వల్ల వారసత్వంగా సంక్రమించే ఒక రుగ్మత, ఇది ఎర్ర రక్త కణాలను కొడవలి లేదా చంద్రవంక ఆకారంలోకి మారుస్తుంది. సికిల్ కణాలు వంచే గుణాన్ని తక్కువగా కలిగి ఉంటాయి. అందువల్ల చిన్న రక్తనాళాల గుండా వెళ్తున్నప్పుడు అవి పగిలిపోయి విచ్ఛిన్నమైపోతాయి. దీని ఫలితంగా ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గుతుంది. ఇది రక్తహీనతకు దారి తీస్తుంది. సికిల్ సెల్ వ్యాధి జన్యుపరంగా వచ్చే వారిలో పుట్టినప్పటి నుంచి ఉంటుంది. అయితే శిశువుదశలో అంటే 5-6 నెలల వయసు వరకు ఎక్కువగా లక్షణాలు బయటకు కనిపించవు. ఆ తర్వాత వయసు పెరిగే కొద్దీ కొద్దికొద్దిగా లక్షణాలు కనిపిస్తాయి. ఎర్ర రక్త కణాల యొక్క హీమోలైసిస్ (రక్తం విరగడం) కారణంగా కామెర్లు, కళ్లు పాలిపోవడం, రక్తహీనత, అలసట రావడం, కాళ్లూ చేతులు వాపు రావడం వంటివి ఉంటాయి. రక్తం ద్వారా ఆక్సీజన్ సరఫరా తక్కువ కావడం వల్ల శరీరంలో ఏదైన ఒక భాగంలో తీవ్రంగా నొప్పి కలుగుతుంది. కౌమార దశలో ఉన్నవారు, పెద్దవారు కూడా తీవ్రంగా దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతారు. జన్యులోపం కారణంగా సికిల్ సెల్ వ్యాధి సంభవిస్తుంది. గర్భాధారణ సమయంలో ఆసుపత్రిలో సికిల్ సెల్ వ్యాధి నిర్ధారించబడుతుంది. సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణకు కొన్ని పరీక్షలు నిర్వహిస్తారు. హిమోగ్లోబిన్ ఎలెక్ట్రోఫోరెసిస్, మూత్రపరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి అంచనా వేస్తారు. రక్తం, ఎముక మజ్జ (బోన్ మ్యారో) మార్పిడి ద్వారా చికిత్స జరుగుతుంది.

### ఈ నెల 19న ప్రారంభం

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో 40 వేల మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వైద్యాఆరోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈ నెల 19వ తేదీన స్పెషల్ డ్రైవ్ ప్రారంభించగా, వ్యాధి ఉన్న వారిని గుర్తించి వైద్యసేవలు అందించనున్నది.


కార్డులు పంపిణీ చేస్తున్న సికిల్ సెల్ జిల్లా ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్, జడ్పీటీసీ అరిగెల

# ఒక్క పెల్లనూ తీయనివ్వం

**బొగ్గు గనులను సింగరేణి సంస్థకే అప్పగించాలి**

● ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తే అసెంబ్లీలో తీర్మానం చేయండి ● అధికారం అప్పగిస్తే కార్మికుల ఉద్యోగాలు ఊడగొడుతారా ● మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్, జూన్ 23 : సింగరేణి గనులు వేలం వేస్తే కార్మికులతో కలిసి ఒక్క బొగ్గు పెల్లను కూడా తీయనివ్వబోమని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివార్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్‌తో కలిసి మాట్లాడారు. బీజేపీ సర్కారు దేశ వ్యాప్తంగా 300 గనులను ప్రైవేట్‌పరం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం 5 బొగ్గు గనులను సింగరేణికే ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని గుర్తు చేశారు. టీబీజీకేఎస్, బీఆర్ఎస్ పోరాటం చేసి గనుల వేలాన్ని అడ్డుకున్నాయని, అవసరమైతే మరోసారి కొట్లాడుతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా గనుల వేలాన్ని నిలిపివేసి.. సింగరేణి సంస్థకే వాటిని అప్పగించాలని డిమాండ్ చేశారు. గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని చెబుతూనే ఉప ముఖ్యమంతి భట్టి విక్రమార్క వేలం ప్రారంభోత్సవానికి ఎలా హాజరయ్యారని ప్రశ్నించారు. నిజంగా గనుల వేలాన్ని వ్యతిరేకిస్తే వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు గనిని వెంటనే వేలం నుంచి తొలగించి సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. గోదావరి నది పరివాహక ప్రాంత బొగ్గు ఖనిజ నిక్షేపాలు కనుగొనడానికి సింగరేణి సంస్థ రూ. 60 కోట్లు ఖర్చు చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం గుజరాత్‌లోలాగే సింగరేణికి కూడా నామినేషన్ పద్ధతిలో గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అధికారం అప్పగిస్తే కార్మికుల ఉద్యోగాలు ఊడగొడతారా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్, కౌన్సిలర్ వంగ తిరుపతి, టీబీజీకేఎస్ మాజీ కార్యదర్శి పానగంటి సత్తయ్య, కోటిలింగం, తొంగల రమేశ్, మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం, మాజీ ఎంపీటీసీలు గుమ్మడి శ్రీనివాస్, తిరుపతి, బాకం నగేశ్, నాయకులు గొర్ల సంతోష్, జక్కుల కుమార్, రాజునాయక్, రఫీక్‌ఖాన్, కాటం రాజు, కందుల ప్రశాంత్, రవిగౌడ్, పెర్క సత్తయ్య, తిరుమల్‌రావు, దగ్గుల మధు, ఉత్తేజ్‌రెడ్డి, పెద్దపల్లి రామయ్య, నరేందర్‌రెడ్డి, వికాస్, భానుచందర్ పాల్గొన్నారు.



శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

### పదేళ్లు పదవులు అనుభవించి పార్టీ వీడుతావా?

**పోచారంపై దివాకర్‌రావు మండిపాటు**

బీఆర్ఎస్ సర్కారులో పదేళ్లపాటు పదవులు అనుభవించి, వృద్ధాప్యంలో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తావా అంటూ మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పోచారం శ్రీనివాస్‌పై మండిపడ్డారు. ఆదివారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఎంతో గౌరవం ఇచ్చారని, కన్నతల్లిలాంటి పార్టీకి ద్రోహం చేస్తావా అంటూ ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఈ వైఖరిని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. పోచారం శ్రీనివాస్‌ను కలవడానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.


బీఆర్ఎస్‌లో చేరిన తొంగల రమేశ్‌తో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

### బీఆర్ఎస్‌లోకి తొంగల

కోల్‌బెల్ట్ నస్పూర్, శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన తొంగల రమేశ్ ఆదివారం తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు రమేశ్‌కు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తొంగల రమేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, నాయకులు రఫీక్‌ఖాన్, పానగంటి సత్తయ్య, ఉత్తేజ్‌రెడ్డి, రాజు నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మెరుగు పవన్, నాయకులు తిరుమల్‌రావు, వెంకట్‌రెడ్డి, జక్కుల రాజేశం, వంగ తిరుపతి పాల్గొన్నారు.

# ఐటీ, ఇండస్ట్రియల్ పార్కులకు కృషి

● ఉత్తర తెలంగాణకు ఆర్థిక రాజధానిని చేస్తా ● మంచిర్యాల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్, జూన్ 23 : మంచిర్యాలలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు కృషి చేస్తున్నానని మంచిర్యాల ఎమ్మెల్యే కే ప్రేంసాగర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేంపల్లి గ్రామ శివారులో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నానని, అడుగగానే వేంపల్లి గ్రామస్తులు సంతోషంగా ముందుకు వచ్చారన్నారు. బసంత్‌నగర్‌లో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలిపారు. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని చెప్పుకొచ్చారు. మంచిర్యాల జిల్లాను ఉత్తర తెలంగాణకే ఆర్థిక రాజధానిగా చేయాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల పట్టణాన్ని కార్పొరేషన్ చేస్తానని, మంచిర్యాల, నస్పూరు పట్టణాలు అమృత్ పథకంలో ఎంపికయ్యాయన్నారు.

### కొలువుదీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆదివారం కొలువుదీరింది. మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి గజానన్.. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పయ్యావుల పద్మ -ముని, వైస్ చైర్మన్ బండారి సుధాకర్, సభ్యులు ఎండీ తాజ మ్ముల్ అహ్మద్, వొన్నోజుల శ్రీనివాస్, పల్లపు సావిత్రి, బదావత్ రమేశ్‌నాయక్, సూరంసతీశ్, తనుగుల సత్యనారాయణ, నారిశెట్టి సంతోష్, దోసేపల్లి లింగయ్య, ధర్ని మల్లేశ్, జనార్దన్, మహేశ్‌కుమార్ జాజు, రావుల మహేశ్, రామారావుల చేత ప్రమాణం స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన వారు ఎమ్మెల్యే పీఎస్సార్, డీసీసీ అధ్యక్షురాలు సురేఖను సన్మానించారు. మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, హేమలత, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యులతో ఎమ్మెల్యే పీఎస్సార్ దంపతులు

# ఆదర్శ ఉపాధ్యాయుల ఆందోళ న బాట

**నేటి నుంచి 29 వరకు నిరసన కార్యక్రమాలు**

దండేపల్లి, జూన్ 23 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నేటి(సోమవారం) నుంచి 29వ తేదీ వరకు ఆందోళన బాట పట్టనున్నారు. తమ సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు రూపొందించారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలలు ఉండగా, 160 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

### ఆదర్శ ఉపాధ్యాయుల డిమాండ్లు..

- బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి.
- 010 పద్దు ద్వారా వేతనం చెల్లించాలి.
- హెల్త్ కార్డులు జారీ చేయాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి.
- హిందీ పీజీటీ పోస్టు ఏర్పాటు చేయాలి.
- పీజీటీలను జేఎల్‌లుగా ఉన్నతీకరించాలి.
- ప్రిన్సిపాల్, పీజీటీ, టీజీటీ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.
- కారుణ్య నియామకాలు చేపట్టాలి.

### నిరసన కార్యక్రమాలు..

- ఈనెల 24న నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావడం. ● 25, 26 తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసనతోపాటు సీఎంవో విద్యాశాఖ కార్యదర్శికి ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం.
- 27న తహసీల్దార్, మండల విద్యాధికారులకు వినతిపత్రాల అందజేత.
- 28న కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి, 29న పాఠశాల విద్యాశాఖ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించడం.

### ధర్నాకు దిగుతాం..



నేటి నుంచి 29 వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం. ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కొన్నేళ్లుగా కోరుతున్నాం. ప్రభుత్వం పట్టించుకోకపోతే ధర్నాకు దిగుతాం.

*- ఎత్రజ్ రాజు, జిల్లా మోడల్ స్కూల్ అసోసియేషన్ కన్వీనర్.*

# అక్రమ పట్టాలు రద్దు చేయాలని ధర్నా


జన్నారం : కిష్టాపూర్ చెరువులో ధర్నా చేస్తున్న మత్స్యకారులు

జన్నారం, జూన్ 23 : మండలంలో కిష్టాపూర్ ఊరచెరువులో అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని చెర్లపల్లె మత్స్యకారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కిష్టాపూర్ చెరువులో ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్నా ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని మత్స్యకారులతో మాట్లాడారు. సర్వే చేసి భూములు ఆక్రమించుకున్నట్లు తేలితే పట్టాలు రద్దు చేస్తామని, హద్దులు నిర్ణయిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

## భీమారం కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు

భీమారం, జూన్ 23 : భీమారం కాంగ్రెస్‌లో మరోసారి వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి రూ. 2 లక్షల రుణమాఫీ ప్రకటన చేయగా శనివారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సమయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుర్గం రాజు ఆందోళన చేశారు. కాంగ్రెస్‌లో ఎన్నివర్గాలు ఉంటాయని, సీనియర్లను పట్టించుకోవడం లేదని, పార్టీలు ఫిరాయించే వారికే ప్రధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కార్యకర్తలను నిలదీశాడు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, సీనియర్ లీడర్లను ఇష్టారీతిన దుర్భాషలాడాడని, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడాడని రాజును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి మోహన్ రెడ్డి ఆదివారం ప్రకటన విడుదల చేశారు.


ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు

# రెబ్బెనలో ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళనం

రెబ్బెన, జూన్ 23 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆధ్వర్యంలో ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా జడ్పీటీసీ, కో ఆప్షన్ మెంబర్, ఎంపీటీసీ సభ్యులను శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జడ్పీటీసీ వేముర్ల సంతోశ్, వైస్ ఎంపీపీ గజ్జల సత్యానారాయణ, కో ఆప్షన్‌మెంబర్ జౌరొద్దీన్, ఎంపీడీవో శంకరమ్మ, సూపరింటెండెంట్ వాసు, ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, ఏపీవో రామ్మోహన్, ఎంపీటీసీలు పెసరి మధునయ్య, సంగం శ్రీనివాస్, దుర్గం శ్రీవాణి, వోల్వోజి హరిత, దోమల సంధ్యారాణి, దుర్గం రాము, లావుడ్య సాగరమ్మ, రఘుపతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అప్రోచ్ రోడ్డు పూర్తి చేయకుంటే నిరవధిక సమ్మె

కాగజ్‌నగర్, జూన్ 23 : అందెవెల్లి పెద్ద వాగు వద్ద వెంటనే అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోతే నిరవధిక సమ్మెకు దిగుతానని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని అందెవెల్లి పెద్ద వాగు వద్ద నిర్మాణంలో ఉన్నా బ్రిడ్జితోపాటు వర్షానికి కొట్టుకు పోయిన తాత్కాలిక వంతెనను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అక్రమ ఇసుక తవ్వకాలతోనే రెండేళ్ల క్రితం బ్రిడ్జి కూలిపోయిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మంత్రి సీతక్క బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించి త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. సకాలంలో బిల్లులు అందకపోవడంతోనే సదరు కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయడం లేదని చెప్పారు. పెద్దవాగుపై బ్రిడ్జి పూర్తి కాకపోవడంతో దహెగాం, భీమిని మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పుకొచ్చారు. సోమవారం సమస్య పరిష్కరించకపోతే బ్రిడ్జి పైనే నివరధిక సమ్మె చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమ్మెకు ఆయా గ్రామాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.


అందెవెల్లి బ్రిడ్జిని పరిశీలిస్తున్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679